కింద చేరి రకరకాల ఆటలు ఆడుకునే వాళ్లం. అది కూడా పెండదొబ్బుడు ఆట ఎక్కువ ఆడుకునేవాళ్లం. ఏగిలివారంగనే మందోట దగ్గరికి పరిగెత్తేవాళ్లం.

మందోట దగ్గర సొట్టలుపడ్డ తట్టలు పట్టుకొని, పెండను నింపుకొనే వాళ్లం. శేషుగాడు అయితే బర్రె పెండ వేసేందుకు తోక లేపంగానే.. అక్కడ తట్ట పట్టుకొని నిల్చుండేవాడు. పెండ భూమి మీద పడక ముందే పట్టుకొనేవాడు. ఒకరితో ఒకరం పెండతో కొట్టుకునే వాళ్లం. స్కూల్ టైం అయ్యేంతవరకూ చెరువులో ఈతకొట్టి.. పెండ తట్టలు పట్టుకొని ఇంటికెళ్లి, స్కూల్‌బ్యాగులు జబ్బకేసుకొని బడికి వెళ్లేవాళ్లం.

కాత్రావుల పండగ వస్తే మా అల్లరి అంతాఇంతా కాదు. మేమంతా ఒకసారి పెండదొబ్బుడాట ఆడుకుంటున్నప్పుడు.. ఒక్కసారిగా ఆ డప్పుల చప్పుడు వినిపించింది.

''ఎల్లుండి పీరీల పండుగ గదా! అజీమొద్దీన్ పెద్దపులి వేషం వేసిండట''.. వేణుగాడు చెప్పగానే నా నిక్కర్ తడిసిపోయింది.

''ఏ.. గా పుర్రెలకు భయపడతార్రా! వీడైతే లాగు లోనే ఉచ్చ పోసుకున్నాడు'' శీనుగాడు నవ్విండు.

రాధిక అయితే భయంతో ఏడవడమే మొదలెట్టింది.

''మా ఇంట్లో పులులు చాయ తాగుతాయ్. నన్నయితే ఏమనయ్!'' రాజేష్‌గాడు గంభీరంగా చెప్పాడు. కానీ, లోలోపల వాడు కూడా మస్తుగా భయపడుతున్నాడు.

''నా బాధ అది కాదురా.. పోయినసారి మా అవ్వ అజీమొద్దీన్‌తో 'డెచ్చ' కొట్టిచ్చింది. మూడు రోజులు భయంతో జ్వరం వచ్చింది!'' భయంతో గొంతు వణుకుతుండగానే చెప్పాను.

ఆ రోజు.. అందరం ఒకరి చేతిని ఒకరం పట్టుకొని, డప్పుల శబ్దం దూరమైనాక ఇళ్లలోకి పోయాం.

పీర్ల పండుగ రోజు రాత్రి అయితే అజీమొద్దీన్ విశ్వరూపం కనిపించేది. పూనకం వచ్చినట్టు ఆడేవాడు. అరుచుకుంటూనే.. నిప్పుల గుండం మీద నుంచి 'అసైదుల్లా!' అంటూ దూకేవాడు. బెల్లం, కుడుకలు, బత్తీసల దండలను నాతోటి వేయించేది నానమ్మ.

'ఓహో జాంబియా ఓలంపెల్లి జాంబియా
నాతోటి మాట్లాడు నాంపెల్లి జాంబియా!
దులా.. దులా.. అసైదులా'.. పాటలతో ఊరంతా హోరెత్తేది.

ఒకసారి మా దోస్తు శీనుగాని అమ్మ.. వాడికి జ్వరం తగ్గకపోతే పీరీల పండగ రోజు పెద్దపులి వేషం వేయిస్తానని మొక్కుకున్నదట. ఆ రోజు శీనుగాడు పులి వేషం వేస్తే.. నేను తోక పట్టుకున్నాను. రాజేష్‌గాడు, వేణుగాడు వచ్చి పిర్రలు గట్టిగా గిచ్చి పోయేవాళ్లు. తెల్లారిపోయి చూసేసరికి రెండు పిర్రలు నల్లగా కమిలిపోయి కనిపిస్తే.. వాళ్లమ్మ మస్తు తిట్టింది.

ఓసారి ఒకాయన ధైర్యం చేసి.. అజీమొద్దీన్ పిర్ర గిల్లాడట. వాణ్ని ఊరంతా మొనగాడిలా చూసిందట. కానీ, అజీమొద్దీన్ వాణ్ని దొరకపట్టుకొని కింద పడేసి.. పొర్లించి పొర్లించి.. పెయ్యంత పసుపు రంగు పూసిండట. అజీమొద్దీన్ వెంట మరో నలుగురు పెద్దపులి వేషం వేసేవారు.

మా ఇంటికి అజీమొద్దీన్ వచ్చినప్పుడు.. పుర్రె తీసి.. 14వ శతాబ్దం నాటి పీరీల విశిష్టత గురించి చెప్పేవాడు. అది పండుగ కాదనీ.. 74 మంది త్యాగధనుల ఫలితమే ఈ తొమ్మిది రోజుల స్మారక దినాలని చెబితే.. ఆ వయసులో అర్థంకాకపోయేది. అశుర్‌ఖానా నుంచి.. నిప్పుల గుండం వరకూ చెప్పేవాడు.

దూలా ఆడుతూ.. మట్కీలు తీసేవరకు.. దురంకారులైన రాజ్యాధిపతులపై తిరుగుబాటు చేసిన హసన్ హుసేన్‌ల గురించి ఉద్వేగభరితంగా చెప్పేవాడు.

'పీర్ అంటే.. 74 మంది ధర్మయుద్ధవీరుల స్మారక దినం!' అని చెప్పేవాడు.

పీరీల పండుగను గమనిస్తే.. తెలంగాణా ఉద్యమానికి ఏదో పేగుబంధం పెనవేసుకున్నట్టు అన్పించేది. అస్తిత్వం కోసం దీక్షలతో తమను తాము హింసించుకోవడం.. బలిదానాలు చేసుకోవడంలాంటి సంఘటనలు ఆవేదనా భరితంగా స్మరించేవాడు.

నేను ఉస్మానియా యూనివర్సిటీలో చదువుతున్నప్పుడు అజీమొద్దీన్ చెప్పిన హసన్ హుసేన్‌ల ఉద్వేగమే గుర్తొచ్చేది. అందుకే నాకు తెలంగాణ ఉద్యమ సమయంలో అజీమొద్దీన్ పదేపదే యాదికొచ్చేవాడు.

దూలా ఆడుతూ.. మట్కీలు తీసేవరకు.. అన్నిటినీ పరిశీలిస్తే తెలంగాణ ఉద్యమ పార్శ్వాలు కొన్ని కనిపిస్తాయి. తెలంగాణకే పరిమితమైన ఈ పెద్దపులుల పండుగ ఇక్కడి మత సామరస్యానికి ప్రతీక. చివరిదైన 9వ రోజునాడు మట్టికుండలో కలిపిన బెల్లం నీళ్లను.. మలీద ముద్దను అజీమొద్దీనే పంచేవాడు. రాగిరేకుల్తో చేసిన పంజా, హస్త, నెలవంకల్ని.. ఊదుపొగల మధ్య ఊరేగించి.. అందరూ 'అస్సయిదులా ఆరతి.. కాళ్ల గజ్జెల గమ్మతి!'.. అంటుంటే తనూ గంతులేసేవాడు. గుండెలు బాదుకుంటూ మాతం నిర్వహించేవాడు.

అసలు అజీమొద్దీన్ బతికున్నాడా!?.. చనిపోయాడా!?.. నన్ను.. నా మనసును.. అజీమొద్దీన్ ఆవహించాడు.

* * *

''సార్.. ఊరొచ్చింది!'' కొంచెం గట్టిగానే అన్నాడు పీఏ.



**'నమస్తే తెలంగాణ, ముల్కనూరు ప్రజాగ్రంథాలయం' సంయుక్తంగా నిర్వహించిన 'కథల పోటీ-2022'లో రూ.3 వేల బహుమతి పొందిన కథ.**